సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



వన్యపాణులను సంరక్షిద్దాం

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగించేందుకు ఏటా అక్టోబర్ 2 నుంచి వన్యప్రాణి వారోత్సవాలను అటవీ శాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. 8లో



పేదలు, వృద్ధులకు ఆసరా

తణుకులో సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలు, వృద్ధులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మన్ననలు పొందుతున్నారు. 8లో




3 నుంచి కుంకుళ్లమ్మ ఉత్సవాలు

ద్వారకాతిరుమల క్షేత్ర దేవతగా విరాజిల్లుతున్న కుంకుళ్లమ్మవారి ఆలయంలో ఈనెల 3 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. 8లో

డీటీ.. పరిస్థితి ఏంటీ?

సర్వేపై సందిగ్ధం

- ప్రశ్నార్థకంగా రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ల కొనసాగింపు
- విధులపై స్పష్టత ఇవ్వని కూటమి సర్కారు
- ప్రతిష్టాత్మకమైన భూసర్వేలో డీటీలదే కీలక పాత్ర
- ఉమ్మడి జిల్లాలో 41 మంది డీటీలు



రాష్ట్రంలో 679 మంది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 సెప్టెంబర్ 22న భూ రీసర్వే నిమిత్తం రాష్ట్రంలో 679 మంది సీనియర్ అసిస్టెంట్‌లను డీటీలుగా నియమించింది. రెవెన్యూ డివిజన్, తహసీల్దార్ కార్యాలయాల్లోని సీనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో ఉన్న వారిని డీటీలుగా నియమిస్తూ, ఆ ఖాళీలను తాత్కాలికంగా రద్దు చేసింది. రెండేళ్ల కాలపరిమితితో పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ క్రమంలో ఈ ఏడాది సెప్టెంబర్ 22వ తేదీతో వీరికి పదోన్నతి గడువు ముగిసింది.

ఏలూరు(మెట్రో) : గత ప్రభుత్వం మీద అక్కసుతో పలువురిని పలు రకాలుగా వేధింపులకు గురిచేస్తున్న కూటమి సర్కారు కన్ను తాజాగా రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లపై పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి శాశ్వత భూ పరిష్కారానికి బ్రిటిష్ కాలం నాటి హద్దులను నిర్ధారించి రైతులకు శాశ్వత హక్కులు అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టేందుకు డీటీలను నియమించింది. శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమం అమలుకు డీటీలు తీవ్రంగా శ్రమించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 48 మండలాల్లో 41 మంది పూర్తిస్థాయిలో రీ సర్వే డీటీలుగా కొనసాగి పొలంగట్ల వెంబడి, చెట్ల వెంబడి తిరుగుతూ భూములను సమస్యలు లేని భూములుగా మార్చారు. ఇది గిట్టని ప్రస్తుత రాష్ట్ర సర్కారు ఆ డీటీలకు పోస్టింగ్‌లు ఇచ్చే విషయంలో తీవ్ర జాప్యం చేస్తోంది. ఇప్పటికీ వారి ఉద్యోగాలను గాలిలోనే ఉంచింది. దీంతో ఏలూరు జిల్లాలో 28 మండలాల్లోని 25 మంది, పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 16 మంది డీటీలు ప్రభుత్వ ఉత్తర్వులు కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం వారికి జీతాలు చెల్లించే విషయంలోనూ స్పష్టత లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

సూపర్ న్యూమరీ పోస్టుల ద్వారా..

క్షేత్రస్థాయి భూ సమస్యలు తొలగించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన రీసర్వే డీటీ పోస్టులు సందిగ్ధంలో పడ్డాయి. భూ రీసర్వే పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు రెండేళ్ల కాలపరిమితితో 'సూపర్ న్యూమరీ' పోస్టులను ప్రవేశపెట్టి అధికారులను నియమించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రీసర్వే ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ రీసర్వే ప్రక్రియను రద్దు చేసింది. దీంతో భూ రీసర్వే డీటీలుగా నియమితులైన వారి

భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అగమ్యగోచరంగా..

రెండేళ్ల కాలపరిమితితో ఇచ్చిన పదోన్నతి గడువు ముగియడంతో డీటీలుగా నియమితులైన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం ఇప్పటికే భూ రీసర్వే రద్దు చేసింది. దీంతో డీటీలుగా ఇచ్చిన పదోన్నతి పొడిగిస్తారా లేదా అనే సందేహంతో వారు ఉన్నారు. కూటమి ప్రభుత్వం చర్యలతో తమ విధులేమిటో తెలియక సతమతమవుతున్నారు. రెండేళ్ల పాటు భూసర్వే కార్యక్రమాల్లో పలు సవాళ్లను ఎదుర్కొంటూ విధులు నిర్వహించామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని భూసర్వే డీటీలంతా ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్నారు.

పొడిగిస్తారా.. ముగిస్తారా..

భూ సర్వే నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి మండలానికీ ఒక రీసర్వే డీటీని నియమించింది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి భూ సర్వేను నిలుపుదల చేశారు. అప్పటినుంచి డీటీలకు నిర్దిష్టమైన విధులు లేవు. ఈ క్రమంలో కలెక్టరేట్‌తో పాటు ఆయా మండలాల తహసీల్దార్ల ఆధ్వర్యంలో ఏదో ఒక పని వారు నిర్వహించాల్సి వస్తోంది. పదోన్నతికి సంబంధించి స్పష్టత లేకపోవడం, వారి విధులు ఏమిటో తెలియని పరిస్థితిలో డీటీలుగా పనిచేస్తున్న వారు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. పదోన్నతిని పరిగణనలోకి తీసుకుని తమ కొనసాగిస్తారా లేక పాత విధుల్లోకి తిరిగి పంపుతారా అనేది తెలియని అయోమయంలో ఉన్నారు. దీనికి తోడు వారికి జీతాల సమస్య వెంటాడుతోంది.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు



ఉండి మండలంలో పంట పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం అర్బన్/ఉండి: ఈ-క్రాప్ నమోదుతోనే ప్రభుత్వ ప్రయోజనాలు సాధ్యమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో సోమవారం క్షేత్రస్థాయిలో వరిచేలను ఆమె పరిశీలించారు. పంట నష్టపరిహారం పొందేందుకు, పంట విక్రయాలకు ఈ-క్రాప్, ఈకేవైసీ తప్పనిసరి అని అన్నారు. ప్రధానంగా కౌలు రైతులు నష్టపోకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో రైతులు సాగు చేస్తున్న పంట వివరాల నమోదుకు ఆదేశించిందన్నారు. జిల్లాలో నమోదు చేసిన ఈ-క్రాప్ వివరాల్లో కొన్నింటిని సూపర్ చెక్ కోసం ఆన్‌లైన్‌లో పంపుతున్నామన్నారు. వీటిని జియో ఫెన్సింగ్‌తో తనిఖీ చేయాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా అందిన వివరాలను వాస్తవ వివరాలతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిపోలుస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, మండల ఏఓ నిమ్మల శ్రీనివాస్, ఏడీఏ చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఉండి మండలంలోని పాందువ్వ, మహదేవపట్నం, ఉప్పులూరు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదుపై సూపర్‌చెక్ కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి పాల్గొని పంట పొలాలను పరిశీలించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి విధుల బహిష్కరణ



సీఐకు వినతిపత్రం అందిస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది

భీమవరం : ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది అక్టోబర్ 1వ తేదీ నుంచి విధులను బహిష్కరిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు తాడి శివ, దుర్గారావు, ముత్యాలరావు, పెద్దిరాజు స్పష్టం చేశారు. సోమవారం భీమవరం మద్యం డిపో వద్ద డిపో మేనేజర్, ఎక్సైజ్ సీఐలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సోమవారంతో ప్రభుత్వ మద్యం పాలసీ రద్దవుతున్న తరుణంలో ఐదేళ్లుగా షాపుల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్స్, సేల్స్‌మెన్స్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త మద్యం పాలసీ నేపథ్యంలో తామంతా నిరుద్యోగులుగా మారుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి



నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ సభ్యులు

భీమవరం : తిరుపతి లడ్డూ వ్యవహారంలో దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ విశ్వ హిందూపరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో సోమవారం భీమవరం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యదక్షుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు మాట్లాడుతూ లడ్డూ తయారీలో కల్తీ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ ద్వారా కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆలయాలు, ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని, అలాగే హిందూ ఆలయాలు హిందువులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు గవర్నర్ పేరుతో వినతి పత్రం సమర్పించారు.

నరసాపురం ఆర్డీఓగా దాసి రాజు



ఆర్డీఓను అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం : నరసాపురం ఆర్డీఓగా దాసి రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉయ్యూరు నుంచి ఆయన బదిలీపై వచ్చారు. నరసాపురం, పాలకొల్లు ప్రాంతాల్లో తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన భీమవరం డివిజన్‌కు ఆర్డీఓగా పనిచేశారు. ఎన్నికల సమయంలో ఉయ్యూరు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను తహసీల్దార్లు, అధికారులు కలిసి శుభాకాంక్షలు చెప్పారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తానని, ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

ఏలూరు ఆర్డీఓగా అంబరీష్



ఏలూరు(మెట్రో) : ఏలూరు ఆర్డీఓగా ఎం.అచ్యుత అంబరీష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ కె.వెట్రి సెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం ఆర్డీఓ అంబరీష్ జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో డి.పుష్పమణిని కలిసి పూల మొక్కలను అందజేశారు.

సిఫార్సు బదిలీలు వద్దు

తణుకు అర్బన్: విద్యాశాఖ మంత్రి ఇచ్చిన మాటకు కట్టుబడి సిఫార్సు బదిలీలను చేపట్టరాదని, ఉపాధ్యాయ బదిలీలను కౌన్సెలింగ్ విధానంలోనే నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ కోరారు. సోమవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో సిఫార్సు బదిలీలే కాకుండా అక్రమ బదిలీలకు తెరతీసేలా ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాలు జారీచేస్తున్నట్లుగా తెలుస్తుందని పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ ఈ విధానానికి పూర్తి వ్యతిరేకంగా ఉందని తెలిపారు.

ఏలూరులో కాల్‌మనీ కలకలం



ఏలూరులో ర్యాలీ చేస్తున్న బాధితులు

- జిల్లా ఎస్పీని కలిసిన బాధితులు
- వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరిక

ఏలూరు టౌన్ : ఏలూరులో కాల్‌మనీ కలకలం రేగింది. కుటుంబ అవసరాల కోసం రుణం తీసుకుంటే, ఇళ్లకు వచ్చి మరీ మహిళలు, బాలికలను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారంటూ బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ సోమవారం ర్యాలీగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఏలూరు జిల్లావ్యాప్తంగా వడ్డీ వ్యాపారి మేడపాటి సుధాకర్‌రెడ్డి అతని అనుచరులు మహ్మద్ అఖిల్ రెహమాన్, గూడవల్లి విద్యాసాగర్, రాజేష్, మరో మహిళ ఆగడాలతో మధ్యతరగతి వర్గాలు తీవ్ర మానసిక వ్యథకు గురవుతున్నాయి. రాత్రి 10 గంటల సమయంలో ఇళ్లకు వచ్చి మహిళలను, బాలికలను లైంగికంగా వేధిస్తున్నట్టు బాధిత మహిళలు ఎస్పీకు గోడు వెళ్లబోసుకున్నారు. తీసుకున్న అప్పుకు ఎంతకాలం డబ్బులు చెల్లించినా తీరలేదంటూ వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇలా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, చిరు వ్యాపారులు, డైలీ కూలీలు కాల్‌మనీ గ్యాంగ్ బారినపడ్డారన్నారు. రూ.50 వేలు అప్పుగా తీసుకుంటే ఐదు ప్రామిసరీ నోట్లు, రెండు రూ.100ల స్టాంప్‌పేపర్లు, రెండు ఖాళీ తెల్లకాగితాలు, చెక్కులపై సంతకాలు పెట్టించుకున్నారని మహిళలు వాపోయారు. ఈ మొత్తానికి రూ.లక్షల్లో వసూలు చేశారని, ఏలూరుతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బాధితులు ఉన్నట్టు చెప్పారు. రౌడీ మూకలతో ఇళ్లకు వస్తూ దారుణంగా ప్రవర్తిస్తున్నారని ఎస్పీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.



జిల్లా ఎస్పీకి సమస్యలు వివరిస్తున్న బాధితులు

కఠిన చర్యలు తప్పవు: జిల్లా ఎస్పీ

జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా అధిక వడ్డీల పేరుతో అక్రమాలకు పాల్పడుతూ మహిళలను, ప్రజలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ కుటుంబ అవసరాల నిమిత్తం ప్రైవేటు వ్యక్తుల వద్ద డబ్బులు రుణంగా తీసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. డబ్బులు తీసుకునే సమయంలో ప్రామిసరీ నోట్లను పూర్తి చేయాలనీ, చెక్కులపైనా ఎంత తీసుకుంటున్నామో రాయాలని అన్నారు. అధిక వడ్డీల పేరుతో మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తారని ఆయన హెచ్చరించారు.

దళిత నేతల నిర్బంధం

- ఎమ్మెల్యే రఘురామ వైఖరిపై నిరసన
- భీమవరంలో కేవీపీఎస్ రౌండ్ టేబుల్ సమావేశం
- అడ్డుకునేందుకు పోలీసుల ప్రయత్నం



భీమవరంలో కేవీపీఎస్ కార్యదర్శి క్రాంతిబాబును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



భీమవరంలో రౌండ్‌టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు



పాలకొల్లులో మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌ను హౌస్ అరెస్టు చేసిన దృశ్యం



అత్తిలిలో మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్

భీమవరం : ప్రజలను రెచ్చగొట్టేలా ఉన్న ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు వైఖరికి నిరసనగా భీమవరంలో సోమవారం నిర్వహించ తలపెట్టిన కేవీపీఎస్ రౌండ్ టేబుల్ సమావేశాన్ని కేవీపీఎస్, వివిధ దళితసంఘాల ముఖ్య నాయకులను హౌస్ అరెస్టు చేసి అడ్డుకోవాలని చేసిన పోలీసుల ప్రయత్నాలు ఫలించలేదు. రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు, అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడాన్ని నిరసిస్తూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో భీమవరం సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించ తలపెట్టారు. సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా సీఐటీయూ కార్యాలయానికి చేరిన కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబును పోలీసులు అదుపులోకి తీసుకుని హౌస్ అరెస్టు చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్, నల్లి రాజేష్, కోనా జోసెఫ్ తదితరులను ఎక్కడికక్కడ హౌస్ అరెస్టు చేసి నిర్బంధించారు. పోలీసుల తీరుపై నాయకులు మండిపడ్డారు.

రఘురామ వ్యాఖ్యలు విరమించుకోవాలి

సీఐటీయూ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్‌కుమార్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణ్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వైఖరి ప్రజల మధ్య చీలికను సృష్టిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మతాల ప్రస్తావన రాజ్యాంగ విరుద్ధమని తక్షణం ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను విరమించుకోవాలని లేకుంటే జిల్లావ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు గౌర్ల రామకృష్ణ, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు బాతు రామస్వామి, రత్నకుమార్, పట్టెం సుభాకర్, తాటిపాక సుధాకరరావు పాల్గొన్నారు.

నల్లి రాజేష్ హౌస్ అరెస్ట్

పాలకొల్లు అర్బన్ : ఉండి మండలం ఏలూరుపాడు వెళ్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నల్లి రాజేష్, ఆయన అనుచరులను పోలీసులు సోమవారం గృహ నిర్బంధం చేశారు. రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వం దళితులపై కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అంబేడ్కర్‌కు జరిగిన అవమానానికి బదులుగా ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని చెప్పారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుండే నగేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి కర్ని జోగయ్య, జిల్లా కార్యదర్శి మర్రె శామ్యూల్ తదితరులను పోలీసులు అడ్డుకున్నారు.

అట్రాసిటీ కేసు పెట్టాలి

అత్తిలి : ఏలూరుపాడులో అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేసిన ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజుపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. అత్తిలిలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బుడితి సుజన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాపాక నాని, బొడ్డు మార్కురాజు, పొన్నమల్ల సంపత్‌రావు, మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్లె రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షలకు మూడు కేంద్రాలు



డీఆర్వో ఉదయభాస్కరరావు

భీమవరం: జిల్లాలో ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటీ పరీక్షల (టెట్) నిర్వహణకు మూడు కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు డీఆర్వో జె.ఉదయభాస్కరరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈనెల 3 నుంచి 21 వరకు భీమవరం డీఎన్ఆర్ కాలేజ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, డీఎన్ఆర్ అటానమస్, తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కాలేజీ కేంద్రాల్లో టెట్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. జిల్లా నుంచి 2,617 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, పరీక్షలకు ఒక్క నిమిషము ఆలస్యమైనా అనుమతించమని అన్నారు. ముగ్గురు డిపార్టమెంటల్ అధికారులు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. డీఈఓ జి.నాగమణి, విద్యా శాఖ సహాయ సంచాలకుడు ఎం.సత్యనారాయణ, డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 159 మంది హాజరు

జంగారెడ్డిగూడెం రూరల్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించారు. 159 మంది నిరుద్యోగులు హాజరుకాగా 38 మంది పలు కొలువులకు ఎంపికయ్యారు. వీరిలో 11 మందిని తుది ఇంటర్వ్యూకు ఎంపిక చేసినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి తెలిపారు. అరబిందో ఫార్మా, అపోలో ఫార్మసీస్ ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా ఉపాధి అధికారి కె.ప్రవీణ్, ఎస్ఏసీ ఏడీఎం వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

164 అర్జీల స్వీకరణ



భీమవరం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): మీకోసం ద్వారా వచ్చే అర్జీలను బాధ్యతతో పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ మందిరంలో పలువురు నుంచి డీఆర్ఓ జె.ఉదయ భాస్కరరావు, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావుతో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకోసం ఫిర్యాదులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నిర్ణీత గడువులోపు వీటికి పరిష్కారం చూపాలన్నారు. మొత్తంగా 164 అర్జీలను స్వీకరించారు. వయో వృద్ధుల అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడు మేకం దుర్గాప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర చర్యలు



భీమవరంలో సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను సత్వరం విచారణ జరిపి పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై చట్టప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం అందించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మొదటి ప్రాధాన్యతగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సివిల్, ఆస్తి, కుటుంబ కలహాలు, సైబర్ నేరాలు తదితర వంటి వాటిపై 16 ఫిర్యాదులు అందాయి.

క్లుప్తంగా

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో న్యాయవాదుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో బహుమతులు అందుకుంటున్న దృశ్యం

భీమవరం: రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో భీమవరం బార్ అసోసియేషన్ సభ్యులు బోకూరి సునీత, రాధ రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో రాజమహేంద్రవరంలో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా విజేతలు సునీత, రాధలను భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, కార్యదర్శి అడబాల ప్రసన్న కుమార్, బోకూరి విజయరాజు అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ నిధులు సద్వినియోగం చేసుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న పుష్పరాజ్

భీమవరం: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పూర్తిగా ఖర్చు చేసి, సద్వినియోగం చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం భీమవరంలోని మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో దళితులకు అనేక ప్రాంతాల్లో శ్మశాన వాటికలు లేక పోగా మరికొన్ని చోట్ల ఆక్రమణలకు గురి కావడం దారుణమన్నారు. దళితులకు శ్మశాన వాటికల ఇబ్బందులపై ప్రభుత్వం ప్రత్యేక కమిటీ నియమించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నేతల సాల్మన్‌రాజు, యువజన విభాగం అధ్యక్షుడు చిగురుపాటి రాజేష్, పిట్టా వినోద్ కుమార్, యాల్ల నిఖిల్‌వర్మ తరపట్ల జోషి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం



కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్ (అపుస్మా) యాజమాన్యం, విద్యార్థులు ముఖ్యమంత్రి సహాయ నిధికి భారీ విరాళం రూ.7,00,835 అందించారు. సోమవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణిని పలు విద్యాసంస్థలు, విద్యార్థులు కలుసుకుని పెద్ద విరాళాలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెంటపాడు: ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం కొండేపాడు గ్రామానికి చెందిన బాలం గంగామల్లేశ్వరరావు(30), గుబ్బల దినేష్, బిల్లా చందులు గూడెం మోటర్‌సైకిల్‌పై వెళుతున్నారు. ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి మలుపు వద్దకు వచ్చేసరికి బియ్యం లోడు లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో గంగామల్లేశ్వరరావుకు తీవ్ర గాయాలై అక్కడే మృతి చెందగా దినేష్, చందులను అంబులెన్స్‌తో గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వన్యప్రాణులను సంరక్షిద్దాం

- పలు జంతు జాతులకు ఆవాసంగా పాపికొండల అభయారణ్యం
- రేపటి నుంచి వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు



పాపికొండల్లో సంచరిస్తున్న పులి

బుట్టాయగూడెం: వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రభుత్వం, వైల్డ్‌లైఫ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఏదొక చోట వేటగాళ్ల స్వార్థానికి ఆవాసాన్నే కాదు ఆయువునూ కోల్పోతున్నాయి. ఏటా ప్రపంచ జనాభా పెరుగుతుండగా వన్య ప్రాణుల సంఖ్య మాత్రం తగ్గుతుంది. కొన్ని జాతులు పూర్తిగా కనుమరుగవగా మరికొన్ని అంతరించిపోయే దశకు చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగించేందుకు ఏటా అక్టోబర్ 2 నుంచి 8 వరకూ వన్యప్రాణి వారోత్సవాలను అటవీశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. జంతువులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని, సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైల్డ్‌లైఫ్ అధికారులు అవగాహన కలిగించేందుకు కృషి చేస్తున్నారు. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంతో పాటు పాపికొండల అభయారణ్యంలోని వన్యప్రాణుల సంరక్షణకు పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు.

1.12 లక్షల హెక్టార్లలో అభయారణ్యం

1,12,500 హెక్టార్లలో పాపికొండల అభయారణ్యం విస్తరించింది. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో పాపికొండల అభయారణ్యం పరిధిలో ఉన్న బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అటవీప్రాంతంలో వన్యప్రాణుల కదలికలు ఎక్కువగా ఉన్నాయి. వైల్డ్‌లైఫ్ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జంతువుల కదలికలు గుర్తిస్తున్నారు. జంతువుల సంరక్షణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పాపికొండల అభయారణ్యంలో ఎలుగుబంట్లు, కొండగొర్రెలు, జింకలు, కొండ చిలువలు, అడవి పందులు, అడవి దున్నలు, ఆగలి, గెద్దలు, నెమళ్లు, చిరుతలు, కురుడు పందులు, చుక్కల దుప్పిలు, సాంబాలు, ముళ్ల పందులు, జాకర్స్, ముంగీసలు, అడవి దున్నలు ఉన్నాయి.

ఈ ఏడాది జంతు గణన

2018లో పాపికొండల అభయారణ్యంలో వైల్డ్‌లైఫ్ అధికారులు జంతుగణనను నిర్వహించి జంతువుల కదలికలను గుర్తించారు. మళ్లీ 2022 జనవరిలో జంతుగణన కార్యక్రమాన్ని చేపట్టారు. పాపికొండల అభయారణ్యంలోని సుమారు 116 ప్రాంతాల్లో 232 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి సర్వేలు నిర్వహించారు. ఈ సర్వేల్లో ఏనుగులు, సింహాలు తప్ప అన్ని రకాల జంతువులు, పక్షులు, ఉభయచర జీవుల్ని గుర్తించారు. జంతువుల సంరక్షణపై బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి వైల్డ్‌లైఫ్ అధికారులు ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు.



ట్రాప్ కెమెరాకు చిక్కిన గొర్రె గేదెలు



అడవిలో సంచరిస్తున్న ఎలుగుబంటి



ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత పులులు



అడవి పందులు



ముళ్ల పందులు

ఐఎస్ జగన్నాథపురంలో మట్టి దందా



ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలోని పుంత రోడ్డులో మట్టి అక్రమ తవ్వకాలు

ద్వారకాతిరుమల: మట్టి బంగారంలా మారింది. దాంతో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలోని పుంత రోడ్డులో గత 15 రోజులుగా అక్రమ మట్టి తవ్వకాల దందా యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. మట్టి మాఫియాలో సూత్రధారులు, పాత్రదారులు కొందరు కూటమి నాయకులు కావడం వల్లే అధికారులు వెనకడుగు వేస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఈ దందాకు కొందరు రెవిన్యూ అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి మట్టి అక్రమ తవ్వకాలు జరిపే సమయంలో, అలాగే మట్టిని అక్రమంగా రవాణా చేసేటప్పుడు రెవెన్యూ, గనుల శాఖ అధికారులతో పాటు, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలి. వారెవరూ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. రియల్ ఎస్టేట్ వెంచర్ల చదునుకు, ఇళ్ల బేస్‌మెంట్ల పూడికకు ఇలా పలు పనులకు ఈ మట్టిని వినియోగిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి నాయకులు ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.వెయ్యికి పైగా విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. దాంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకుని, అక్రమార్కులపై తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి పేరిట అక్రమ వసూళ్లు



ఫిర్యాదు చేస్తున్న బాడవ మాజీ సర్పంచ్ ఇలపకుర్తి నరసింహారావు

యలమంచిలి: బాడవ గ్రామ ప్రజలకు మంచి నీరు ఇస్తానని చెప్పి సర్పంచ్ రాయి వెంకట కనకదుర్గ భర్త సత్యనారాయణ గ్రామ ప్రజల నుంచి రూ.3 లక్షలు అక్రమంగా వసూలు చేశారని మాజీ సర్పంచ్ ఇలపకుర్తి నరసింహారావు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఏడేళ్ల క్రితం గ్రామంలో ఓఎన్జీసీ సంస్థ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఆ ప్లాంట్‌లో మంచి నీటిని ఉచితంగా తీసుకెళ్లేందుకు ఊరిలో ఉంటున్న 850 కుటుంబాలకు మంచినీటి కార్డులు ఇచ్చారు. ఆ కార్డుపై ప్రతి రోజు ఒక్కో కుటుంబానికి 20 లీటర్ల నీరు ఉచితంగా ఇచ్చేవారు. ఆ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు వస్తే పంచాయతీ జనరల్ ఫండ్స్ నుంచి డబ్బుని తీసి బాగు చేయించేవారు. ప్రస్తుత సర్పంచ్ అధికారంలోకి వచ్చాక ఆమె భర్త సత్యనారాయణ ఓఎన్జీసీ సంస్థ కార్డులను రద్దు చేసి మరమ్మతులు, మంచినీటి ప్లాంట్ నిర్వహణకు కొత్త కార్డులు ఇచ్చి ఒక్కొక్క కార్డుదారు నుంచి రూ.300 చొప్పున రెండు సార్లు వసూలు చేశారు. దీనిపై ప్రశ్నిస్తే గొడవకు దిగారని చెప్పారు. ప్రస్తుతం మరొకసారి డబ్బుని సేకరించి కొత్త కార్డుల జారీకి ప్రయత్నిస్తున్నారని.. అధికారులు స్పందించి ఈ అక్రమ వసూళ్లను అడ్డుకోవాలని కోరారు.

3 నుంచి కుంకుళ్లమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు



క్షేత్రదేవత కుంకుళ్లమ్మ అమ్మవారు



కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయ ద్వారాల ముస్తాబు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈనెల 3 నుంచి 12 వరకు జరుగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ నెల 3న శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా, 4న గాయత్రి దేవిగా, 5న అన్నపూర్ణా దేవిగా, 6న లలితా త్రిపుర సుందరీ దేవిగా, 7న మహాచండిగా, 8న మహాలక్ష్మిగా, 9న సరస్వతీ దేవిగా దర్శనమిస్తారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మవారికి కుంకుమార్చన, లక్ష పుష్పార్చన నిర్వహిస్తారు. 10న దుర్గాదేవిగా, 11న శ్రీ మహిషాసుర మర్దనిగా, 12న రాజరాజేశ్వరి దేవిగా కటాక్షించనున్నారు. విజయ దశమిన రథోత్సవం క్షేత్ర పురవీధుల్లో వైభవంగా జరుగనుంది. 13న దీక్షాధారుల ఇరుముడి సమర్పణ, చండీహోమాన్ని నిర్వహిస్తారు.

కవి ప్రసాద్‌కు అక్కినేని పురస్కారం

తణుకు: అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, సాహితీ కిరణం, యువ కళావాహిని సంయుక్తంగా నిర్వహించిన అక్కినేని సాంఘిక చిత్రాలు అంశంపై జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ పురస్కారం అందుకున్నారు. ఈ నెల సెప్టెంబరు 28న హైదరాబాదు రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు.

మద్యం షాపుల ఉద్యోగులకు బెదిరింపులు



భీమవరంలోని ప్రభుత్వ మద్యం షాపు(ఫైల్)

భీమవరం: ప్రభుత్వం మద్యం షాపుల్లో పనిచేసే ఉద్యోగులపై ప్రభుత్వం బెదిరింపులకు దిగుతోంది. సెప్టెంబర్ నెలాఖరుతో జీవో నెంబర్ 7 గడువు ముగియడంతో తాము పనిచేసేది లేదంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అల్టిమేటం జారీచేయడంతో అక్టోబర్ 1 నుంచి మద్యం షాపులు మూతపడే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో సుమారు 202 మద్యం షాపులు ఏర్పాటుచేయగా వాటిలో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్స్, నైట్‌వాచ్‌మెన్స్ దాదాపు 900 మంది వరకు పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పాత పద్ధతిలోనే మద్యం షాపులను ప్రైవేటు వ్యాపారులకు కట్టబెట్టేందుకు టెండర్స్ విధానం అమలుచేయనుండడంతో ఇంతవరకు మద్యం షాపుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. గత ప్రభుత్వం వీరికిచ్చిన అవకాశం సెప్టెంబర్‌తో ముగియడంతో అక్టోబర్ 1 నుంచి తాము విధులు నిర్వహించేదిలేదంటూ రాష్ట్రవ్యాప్తంగా అల్టిమేట్టంలో భాగంగా జిల్లాలోని మద్యంషాపుల్లో పనిచేసిన ఉద్యోగులకు తేల్చి చెప్పారు. దీంతో మంగళవారం నుంచి మద్యం షాపుల నిర్వహణపై ఇబ్బందులు ఏర్పడతాయని గుర్తించిన అధికారులు ఇంత వరకు షాపుల్లో పనిచేసిన ఉద్యోగులను భయపెట్టడం ప్రారంభించారు. ప్రభుత్వం నూతన విధానం అమలులోనికి వచ్చేవరకు పనిచేయాలని లేకుంటే మీపై కేసులు పెడతామంటూ హెచ్చరికలు చేస్తున్నారు. షాపుల్లో పనిచేసే అనేక మంది గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగులు ఉన్నందును కేసులు పెడితే ఏ ఉద్యోగంలోను చేరే అవకాశముండదని జీవితాలు నాశనమవుతాయని హెచ్చరిస్తున్నట్లు తెలిసింది. తాము ఎట్టి పరిస్థితుల్లో పనిచేసేదిలేదని చెబుతుండడంతో మంగళవారం షాపుల నిర్వహణ ఎలా ఉంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

కొబ్బరి రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని కొబ్బరి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ యాదవ కళ్యాణ మండపంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర సమావేశాన్ని రాష్ట్ర కోకన్వీనర్ బత్తిన లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కొబ్బరి రైతుల సమస్యలపై చర్చించి కార్యచరణ రూపొందించారు. సమావేశంలో కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెల్ల దోమ, ఎర్రనల్లి వంటి తెగుళ్లతో దిగుబడులు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొబ్బరికాయలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రనల్లి, తెల్ల దోమ వంటి తెగుళ్ళ నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

కత్తులు, రాడ్లతో దాడి

ఏలూరు టౌన్: తంగెళ్ళమూడి ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నాయి. ఒక వ్యక్తిని తలపై, మెడపై రాడ్లుతో కొట్టగా, కత్తులతో నరికారు. తీవ్ర గాయాలు కావడంతో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు విజయవాడ తరలించాలని రిఫర్ చేశారు. తంగెళ్ళమూడి ఎంఆర్‌సీ కాలనీలో ఆదివారం రాత్రి గంగానమ్మ జాతర వేడుకలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో రెండు వర్గాల మధ్య వివాదం ఏర్పడగా అది కాస్తా దాడులకు దారితీసింది. దాడుల్లో మానుకొండ గంగాధరరావుపై మరోవర్గానికి చెందిన వ్యక్తులు దాడి చేశారు.

పేదలు, వృద్ధులకు ఆసరా

- ప్రశంసలందుకున్న సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సేవలు
- నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం



తణుకులో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం (ఫైల్)

తణుకు అర్బన్: వారంతా ఉద్యోగ, వ్యాపార రంగాల్లో 60 ఏళ్లపాటు తమ కుటుంబాల కోసం తీవ్రంగా శ్రమించారు. జీవితంలో రిటైర్ అయిపోయామని భావించి అలసిపోలేదు. ఇక నుంచి సమాజానికి ఉపయోగపడాలని భావించారు. ఒక అసోసియేషన్ స్థాపించి సమాజ సేవకు నడుంకట్టారు. ఆ చిన్నపాటి అసోసియేషన్ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపికైంది. అదే తణుకులోని సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్.

2014లో స్థాపన

2014లో తణుకులో ఈ అసోసియేషన్ స్థాపించారు. వృద్ధులకు అవసరమైన సేవలు అందిచడంతో పాటు.. వేసవిలో మజ్జిగ చలివేంద్రం, ఉచిత న్యాయ సలహా కేంద్రం, వృద్ధులు, పేదలకు సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో పేదలు, రిక్షా డ్రైవర్లకు నిత్యావసరాలు, కూరగాయలు అందచేశారు. సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2019లో వీరికి స్టేట్ బెస్ట్ ఇన్‌స్టిట్యూషనల్ సర్వీసెస్ అవార్డును ప్రకటించింది. ప్రతి మంగళవారం బీపీ, సుగర్ బాధితులకు రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తారు. శిబిరానికి 30 నుంచి 50 మంది రోగులు వస్తుంటారు. పేద వృద్ధులకు ఉచితంగా మందులు అందచేస్తున్నారు.

వివిధ సేవాకార్యక్రమాలు

ప్రతి ఏడాది వేసవిలో కార్యాలయం ముందు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేసి ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నారు. వృద్ధులకు సంబంధించి వారసుల వేధింపులు, ఆస్తిని కోల్పోయి ఇబ్బందులు పడుతున్న వయో వృద్ధులను ఆదుకునేలా న్యాయ నిపుణుల సాయంతో న్యాయ సలహా కేంద్రం నిర్వహిస్తున్నారు. జూన్ 15న వృద్ధుల వేధింపుల నిరోధక దినోత్సవం నాడు ర్యాలీలు, అవగాహన సభలు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 16న వృద్ధుల కోర్కెల దినోత్సవం, ఆగస్టు 21న జాతీయ వృద్ధుల దినోత్సవం, అక్టోబరు 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవం రోజున ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంజినీర్స్, డాక్టర్స్ డే రోజుల్లో సైతం ఆయా రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారికి అసోసియేషన్ తరఫున సత్కారాలు చేస్తున్నారు. ఆలయాల వద్ద ఉండే పేదలు, వృద్ధులకు అన్నదానంతో పాటు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు.

ఉచిత వైద్య సేవలు



పేద వృద్ధులకు ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో మా అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం వైద్య సేవలు అందిస్తున్నాం. అసోసియేషన్ కోరిక మేరకు పట్టణానికి చెందిన సీనియర్ వైద్యుడు డాక్టర్ భూపతిరాజు రమేష్ చంద్రబాబు అసోసియేషన్ కార్యాలయానికి వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు.

– అద్దాల సత్యనారాయణ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

సేవ చేయాలనే ఉద్దేశంతో..



పదవీ విరమణ పొందిన తరువాత సేవ చేయాలనే ఉద్దేశ్యంతో అసోసియేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలకు తెర దీశాం. ఎంతో మంది వృద్ధులు మా అసోసియేషన్ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. వేసవిలో మజ్జిగ కేంద్రం నిర్వహణతో పాటు సందర్భాన్ని బట్టి పేదలు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు, ఆహారం అందజేస్తున్నాం.

– కొటికలపూడి చిట్టివెంకయ్య, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కోవిడ్‌లో సేవలకు గర్విస్తున్నాం



కోవిడ్ సమయంలో కూడా మా సేవలు ఆగలేదు. పేదలు, రిక్షా డ్రైవర్లకు నిత్యావసర సరుకులు, కూరగాయలు అందచేశాం. సెకండ్ ఇన్నింగ్స్‌లాంటి మా జీవితంలో ఇలాంటి సేవలు అందజేస్తున్నందుకు చాలా గర్వపడుతున్నాను.

ఈదర ప్రసాదరావు, సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

విదేశీ కరెన్సీ పేరిట మోసం

నరసాపురం రూరల్: విదేశీ కరెన్సీ నోట్లు తీసుకుని మన కరెన్సీ నోట్లు ఇవ్వాలని ట్రాప్ చేసి వ్యక్తిని మోసం చేసిన సంఘటన మొగల్తూరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రూరల్ సీఐ దుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన రాపాక చంద్రరావు కలిదిండిలో ఉంటున్నాడు. అతను విదేశీ కరెన్సీ నోట్లు కొంటూ ఉంటాడు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఒక వ్యక్తి చంద్రరావుకు ఫోన్‌చేసి తన వద్ద విదేశీ కరెన్సీ ఉందని.. రూ.2 లక్షలు దేశీయ కరెన్సీ తీసుకు రమ్మని చెప్పాడు. చంద్రరావు కలిదిండి నుంచి రూ. 2లక్షలు తీసుకుని వచ్చే సరికి రాజుగారి తోట క్రాస్ రోడ్డు వద్దకు వచ్చే సరికి గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి చంద్రరావుపై దాడి చేసి రూ.2 లక్షల నగదు దోచుకుపోయారు. చంద్రరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

భీమవరం: భీమవరం పెద్దపేట రైల్వే ట్రాక్ వద్ద నలుగురు యువకులను అరెస్ట్ చేసి వారి నుంచి ఆరు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. విశాఖ ఏజెన్సీ నుంచి పెద్దపేటకు చెందిన గుంటి అరుణ్ కుమార్(నాని), ఏనేపల్లి కృష్ణవంశీ (చింటూ) గంజాయి తీసుకొచ్చి కొంతకాలంగా విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో సోమవారం సాయంత్రం దాడి చేశారు. దాడిలో అరుణ్ కుమార్ కృష్ణవంశీతో పాటు వేంద్ర గ్రామానికి చెందిన గొబ్బల నవీన్ కుమార్(పండు) దుర్గా పురానికి చెందిన పంతకాని ఏసురాజును కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి 6 కేజీల గంజాయి, 4 సెల్ ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుంటి అరుణ్ కుమార్, ఏనేపల్లి కృష్ణవంశీ, గుబ్బల నవీన్ కుమార్లపై గతంలో గంజాయి కేసులు ఉన్నట్లు తెలిపారు.

వీధి కుక్కలు భౌబోయ్!

- గ్రామాల్లో విచ్చలవిడిగా సంచారం
- వీధి కుక్కల నియంత్రణలో అధికారుల వైఫల్యం



తణుకులో గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

తణుకు: తణుకు నియోజకవర్గంలో కుక్కకాటు బాధితులు పెరుగుతున్నారు. తణుకు మున్సిపాలిటీతోపాటు తణుకు, ఇగరవరం, అత్తిలి మండలాల్లో అధికారులు వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమం చేపట్టినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఫలితం లేదు. మాంసం, చేపల దుకాణాలు, కోళ్ల ఫారాలు ఉన్న ప్రదేశాల్లో వీధి కుక్కలు మకాం వేసి తమ సంతతిని పెంచుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలపై వీధి కుక్కల దాడులు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. దాడుల్లో గాయపడినవారు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. కొంత మంది నాటు వైద్యంపై ఆధారపడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

కుక్కకాటుపై నిర్లక్ష్యం వద్దు

వీధి కుక్కలతో పల్లె ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తణుకు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఏ వీధికి వెళ్లినా వీధి కుక్కలు పదుల సంఖ్యలో కనిపిస్తున్నాయి. రహదారులు, మాంసం, చేపల దుకాణాల వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉంది. దీంతో ప్రయాణీకులు, వాహనదారులు, విద్యార్థులు, పిల్లలు, మహిళలు రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారు. అయితే కుక్కే కదా కరిచింది.. తినే ఆహారంలో పత్యం పాటిస్తే సరిపోతుందిలే అనుకుంటే ప్రాణాలే పోగొట్టుకునే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రయాణికులు, విద్యార్థులు, వాహనదారులపై వీధి కుక్కల దాడులు ఈ మధ్య కాలంలో అధికమయ్యాయి. వీధుల్లో సంచరిస్తున్న కుక్కలకారణంగా గ్రామీణప్రాంతాల్లో ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో వీధుల్లో సంచరిస్తూ అరుపులతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పెంచుకొంటున్న గొర్రెలు, మేకలు, పశువులు, కోళ్లపై కుక్కలదాడులు పెరుగుతున్నాయి. కుక్క కాటుకు గురై పశువులు మరణిస్తున్నాయి. పశువుల్ని మేతకు వదిలినప్పుడు ఇవి దాడి చేస్తున్నాయి. కొన్నిసార్లు పశువుల గాయాలకు కుక్క కాటే కారణమని తెలియక, వైద్యం అందించక పోవడంతో మృత్యువాత పడుతున్నాయి.

రేబీస్ వ్యాధి లక్షణాలు

- జ్వరం, వాంతులు, విరేచనాలు, తలనొప్పి, గొంతునొప్పి వస్తుంది.
- ఫిట్స్, కాళ్లు చేతులు పడిపోవడం(పక్షవాతం), కోమా, పిచ్చి పిచ్చిగా మాట్లాడటం వంటి లక్షణాలు తలెత్తుతాయి.
- క్యాన్సర్, మధుమేహం వ్యాధిగ్రస్తులు 28వ రోజునా వ్యాక్సిన్ డోస్ తీసుకోవాల్సి ఉంటుంది.

కుక్క కాటు వేస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కుక్క కరిచిన వెంటనే సబ్బుతో గాయాన్ని శుభ్రం చేసి, దగ్గర్లో ఉన్న ఆస్పత్రిని సంప్రదించాలి.
- యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
- గాయానికి ఎప్పటికప్పుడు డ్రెసింగ్ చేయించాలి.
- ఏఆర్‌వీ వ్యాక్సిన్ 0, 3, 7, 14 రోజుల చొప్పున తీసుకోవాలి.
- కుక్క కాటుకు ఆహార నియమాలేవీ లేవు.
- కరచిన కుక్కను 10 రోజులపాటు గమనించాల్సి ఉంటుంది.
- కుక్క ఆరోగ్యంగా ఉంటే గాయపడిన వారు భయపడనక్కర్లేదు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీలకు కడకట్ల విద్యార్థులు



జిల్లా స్థాయికి ఎంపికైన కడకట్ల విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం తబిత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు డాక్టర్ కోడే వెంకట్రావు మునిసిపల్ ప్రధానోపాధ్యాయురాలు కె.తబిత తెలిపారు. బాడ్మింటన్‌లో ఎస్.సంతోష్, యోగాలో జి.శివాని, పి.అఖిల్, కె.హారికలు ఎంపికైనట్లు చెప్పారు. వీరికి తర్ఫీద్ ఇచ్చిన పీఈటీలు పి.బి.నాగేంద్ర, యోగా ఇన్‌స్ట్రక్టర్ రూపాను, క్రీడాకారులను పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దాత వెంకట్రామయ్య తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని స్థానిక ఏరియా ఆసుపత్రి వెనుక దానమ్మనగర్‌లో ఇటీవల మృతిచెందిన ఎం.పండు పేద కుటుంబానికి దాత వెంకట్రామయ్య సోమవారం రూ.లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాపల రమేష్, ఎం.చిట్టి పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు డాక్టర్ పీఎల్‌వీ ప్రసాద్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బొలిశెట్టి

తాడేపల్లిగూడెం (టీఓసీ): చిరస్మరణీయుడు డాక్టర్ పీఎల్‌వీ ప్రసాద్ అని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. డాక్టర్ పీఎల్‌వీ ప్రసాద్ జయంతి పురస్కరించుకుని, పట్టణంలోని స్పోర్ట్స్ ఎరేనాలో జరిగిన షెటిల్ పోటీలలో భాగంగా సోమవారం జరిగిన సభలో విజేతలకు షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలు, బహుమతులను బొలిశెట్టి అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ ఎరేనాలో ఆటలలో శిక్షణ ఇవ్వడం, పోటీలు నిర్వహించి బహుమతులు అందించడం అభినందనీయమన్నారు. వైద్యులు శ్రీనివాస్, డాక్టర్ పీఎల్‌వీ ప్రసాద్ సతీమణి శోభారాణి, డాక్టర్ వర్మ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వసతులు కల్పించాలని వినతులు



ఎమ్మెల్యే రాధాకృష్ణకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న జగనన్న కాలనీవాసులు

తణుకు అర్బన్: పైడిపర్రులోని జగనన్న కాలనీలో వసతులు కల్పించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మునిసిపల్ కమిషనర్ డి.రామ్‌కుమార్, హౌసింగ్ విభాగ అధికారులకు వినతులు అందచేశారు. కాలనీలోకి వెళ్లే రహదారులు, డ్రైయినేజీ, తాగునీరు, రేషన్, విద్యుత్ దీపాలు, చెత్త సేకరణ వంటి సమస్యలు పరిష్కారించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ విజయదశమి అనంతరం కాలనీలోకి వచ్చి సమస్యలను నేరుగా చూసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేలా కార్యాచరణ చేస్తానని చెప్పినట్లు కాలనీవాసులు తెలిపారు.

వరద బాధితులకు చేయూత

తాడేపల్లిగూడెం : ఆపదలో ఉన్న వారిని ఆదుకొనేందుకు దాతలు ముందుండాలని పలువురు వక్తలు తెలిపారు. వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి శశి విద్యాసంస్థల తరపున రూ.25 లక్షల విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును సంస్థ వైస్ చైర్మన్ ఎం.నరేంద్రకృష్ణ మంత్రి లోకేష్‌కు సోమవారం అందించారు. ఉపాధ్యాయుల ఒక రోజు వేతనం, విద్యార్థులు సేకరించిన నిధులతో పాటు మేనేజ్‌మెంటు విరాళం కలుపుకొని ఈ మొత్తం అందించినట్టు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు ఫిర్యాదులు

తాడేపల్లిగూడెం: మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కేవలం రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఒకటి, టిడ్కో ఇళ్లకు సంబంధించి మరొక ఫిర్యాదు అందినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ ఏసుబాబు, ఇంజనీర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ తరగతులు విజయవంతం చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్టోబర్ 2వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపీటీఎఫ్ జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులు జరగనున్నట్లు, వాటిని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణలు వెల్లడించారు. ఈ తరగతులకు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజులు పాల్గొంటారని తెలిపారు. యూనియన్ జిల్లా సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్‌లు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు, మండల, పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు.

శ్రీవారి ఆలయ నిర్మాణానికి సాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన మారిశెట్టి పోతురాజు – సునీత దంపతులు, వారి మిత్రులు గ్రానైట్, కూలి ఖర్చులు మొత్తం రూ.5లక్షలను సమకూర్చారు. గతంలోనూ ఆలయానికి రూ.1,01,116లను అందజేసినట్లు ఆలయ ట్రస్ట్, కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు



ఒరిస్సాలో జరిగిన బూట్ శిబిరంలో పాల్గొన్న తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

తణుకు టౌన్: పట్టణంలోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఒరిస్సాలోని సంబల్‌పూర్ ఐఐఎంలో ఐదు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి బూట్ క్యాంప్‌లో తమ కళాశాలకు చెందిన బీఎస్సీ విద్యార్థులు పీ సుబ్రహ్మణ్యం, ఎం శ్రీలత, కె మహేష్, కె అభిషేక్‌లు పాల్గొని విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ తెలిపారు. సెప్టెంబరు 23వ తేదీ నుంచి 28 వరకూ ఏఐసీటీఈ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈశిబిరంలో ఇన్నోవేషన్ డిజైన్, అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ బూట్ క్యాంప్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. రైల్వే స్టేషన్ నావిగేషన్ అప్లికేషన్ అనే సాఫ్ట్ వేర్ సొల్యూషన్‌పై జరిగిన పోటీలలో తమ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. శిబిరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి రాష్ట్రంలో తమ కళాశాల ఒక్కటే పాల్గొన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యార్థులకు మెంటార్‌గా కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు ఆర్ అశోక్ కుమార్ వ్యవహరించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

జాబ్ మేళాలో 30 మంది ఎంపిక



జాబ్ మేళాలలో ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకులోని శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 30 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈజాబ్ మేళాలో పలు సంస్థలు కాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి వాటికి అవసరమైన సిబ్బంది కోసం అభ్యర్థులను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేళాకు వివిధ కళాశాలల నుంచి మొత్తం 100మంది అభ్యర్థులు హాజరుకాగా వారిలో 30 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్, స్కిల్ హబ్ ఇన్‌చార్జి డాక్టర్ కే నాగభూషణ్ రెడ్డి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ బీ విజయకుమార్, మనోజ్, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

పెంటపాడు: విద్యార్థులు అంబేత్కర్ ఆశయాలను కొనసాగించడం ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలను అంబేడ్కర్ సందర్శించి 80 వసంతాలు పూర్తైన సందర్భంగా సోమవారం స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అరుణ, గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళల ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగరాజుతో పాటు, విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ మేనేజర్, ఉమ్మడి జిల్లా మానవత పూర్వాధ్యక్షుడు తాడేపల్లి మోహనరావులు మాట్లాడారు. బ్రిటీష్ హయంలో జైలుగా ఉన్న ప్రస్తుత బేసిక్ పాఠశాలను 1944 సెప్టెంబర్ 30న అంబేడ్కర్ సందర్శించారన్నారు. జైలును ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంగా మార్చాలని బ్రిటీష్ ప్రభుత్వానికి ఆయన లేఖ రాసారన్నారు. అనంతర కాలంలో బేసిక్ పాఠశాలగా రూపుదిద్దుకొందన్నారు. అంబేడ్కర్ నడయాడిన ఈ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు సెంట్రల్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేకంగా పాఠశాల పేరున స్టాంప్ విడుదల చేసారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కిలపర్తి వెంకటరావు, డీసీసీబీ మాజీ సభ్యులు దాసరి అప్పన్న, బహుజన నాయకులు గుంపుల సత్యకృష్ణ, ఎంఈవో టీవీ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, ఎస్సీ నాయకులు కళింగ లక్ష్మణరావు, గ్రామ ప్రముఖులు చంద్రశేఖరరెడ్డి,స్కూలు ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

అక్టోబరు 3 నుంచి ఉత్సవాలు ప్రారంభం



ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న విద్యుద్దీపాలంకరణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారి దేవస్థానంలో దసరా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి ప్రారంభం కానున్నాయి. 12వ తేదితో ముగియనున్నాయి. తొమ్మిది రోజులు తొమ్మిది అలంకరణల్లో ముత్యాలమ్మ వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాలకు మరో రెండ్రోజులు మాత్రమే సమయం ఉండటంతో దేవస్థానాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రత్యేక యాగశాలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులను ఆకట్టుకునే విధంగా విద్యుద్దీపాలంకరణలు చేస్తున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి. హరేరాంప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ కమిటి ఏర్పాట్లు చేస్తోంది.

ఏ రోజు ఏ అలంకరణ

ముత్యాలమ్మ వారి దేవస్థానంలో తొమ్మిది రోజుల పాటు దసరా ఉత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా అక్టోబరు 3న రజిత కవచ ముత్యాలమ్మ, 4న శ్రీలలిత త్రిపుర సుందరీదేవిగా, 5న శ్రీగాయత్రీదేవిగా, 6న శ్రీఅన్నపూర్ణా దేవిగా, 7న శ్రీమహాలక్ష్మీదేవిగా, 8న శ్రీమహాకాళికాదేవిగా, 9న శ్రీసరస్వతీదేవిగా, 10న శ్రీదుర్గాదేవిగా, 11న శ్రీమహిషాసురమర్ధనీ దేవిగా, 12న శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొమ్మిది రోజులు చండీ పారాయణ, చండీ హోమం, సహస్ర కుంకుమార్చన, పుష్పార్చన ఇత్యాధి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9వ తేదిన బాలబాలికలతో సరస్వతీ పూజలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పాప్పాప్పు హరేరాంప్రసాద్ తెలిపారు. భక్తులు నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించి, తరించాలని విజ్ఞప్తి చేశారు.

బదిలీపై వెళ్లిన సిబ్బందికి సత్కారం



తణుకులో బదిలీపై వెళ్లిన ఇరిగేషన్ అధికారులకు సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు ఇరిగేషన్ శాఖలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన సిబ్బందికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం సాయంత్రం తణుకు ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండపాక ఏఈ బాల మురళీ, అత్తిలి ఏఈ అనిల్ తేజలు బదిలీపై వెళ్తున్న సందర్భంగా విజన్‌లోని ఇరిగేషన్ కార్యాలయ సిబ్బంది సత్కరించారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ కే శ్రీనివాస్, లాక్ సూపరిండెంటెండ్ ముప్పిడి విజయకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రసాదరాజుని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజును కలిసిన గూడెం వైఎస్సార్ సీపీ శ్రేణులు

తాడేపల్లిగూడెం: పట్టణంలో వైఎస్సార్ సీపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఇద్దరు జెడ్పీటీసీలు, ఒక ఎంపీపీ, గూడెం పట్టణ అధ్యక్షులు, పది మంది సర్పంచ్‌లు, పదిమంది ఎంపీటీసీ సభ్యులు జిల్లా అధ్యక్షునితో పార్టీ విషయాల గురించి చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై అధ్యక్షుడితో మాట్లాడారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి , పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని శ్రేణులతో జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు కోరినట్లు నాయకులు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంను చేయడానికి ప్రతీ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు కంకణం కట్టుకోవాలని జిల్లా అధ్యక్షుడు దిశానిర్దేశం చేశారని, ఈ మేరకు పనిచేస్తామని గూడెం శ్రేణులు తెలిపాయి. గూడెం, పెంటపాడు మండలాల జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల ఆంజనేయులు, వరలక్ష్మి, గూడెం ఎంపీపీ పొనుకుమాటి శేషులత, తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, ఎంపీటీసీలు మర్లపూడి సుబ్బారావు, నార్ని శంకరం, కవులూరి వెంకన్న ,నార్ని నాగులు, సర్పంచ్‌లు చుండ్రు శ్రీను, ఎలిపే గాంధీ, నాయకులు మాకరాజు సతీష్, మాకిరెడ్డి వెంకటేష్ రెడ్డి, రెడ్డి రమేష్, మాకిరెడ్డి గాంధీ, అఖిల్ రెడ్డి, సబ్బితి బ్రహ్మయ్య, దారపురెడ్డి శ్రీనివాసు, అడ్డాల గోపీ, చిట్టూరి బాపన్న చౌదరి, కునుకు పుల్లయ్య, కుమారస్వామి, రామకృష్ణ, ఉమ, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చిన్నం సురేష్, సేవాదళ్ చైర్మన్ కృపావరం, నియోజకవర్గ సోషల్ మీడియా బాధ్యులు ఉర్ల నవీన్ తదితరులు ప్రసాదరాజును కలిసిన వారిలో ఉన్నారు.

నేటితో ముగియనున్న ఈ కేవైసీ ప్రక్రియ

అత్తిలి: సార్వా ఈ పంట నమోదుకు సంబంధించి ఈ కేవైసీ ప్రక్రియ నేటితో ముగుస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ సోమవారం చెప్పారు. ఈ కేవైసీ చేయించుకోని రైతులు వెంటనే సమీప రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్ వద్ద ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ క్రాప్‌లో ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ధాన్యం అమ్మడం, పంటనష్ట పరిహారం, సున్నా వడ్డీ, క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తాయని ఏఓ రాజేష్ తెలిపారు.

విద్యుత్ సంస్థ అభివృద్ధిలో మీటర్ రీడర్లు కీలకం

తణుకు: విద్యుత్ సంస్థ అభివృద్ధిలో మీటర్ రీడర్ల పాత్ర కీలకమని తణుకు సబ్ డివిజన్ ఏడీఈ పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం తణుకు సబ్‌డివిజన్ కార్యాలయం పరిధిలోని మీటర్ రీడర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఐఆర్ పోర్ట్ బిల్లింగ్, క్యూఆర్ కోడ్ బిల్లింగ్ నూరు శాతం కావాలని ఆయన సూచించారు. ప్రతి సర్వీసుకు పక్కాగా స్కానింగ్ బిల్ నమోదు అమలు చేయాలన్నారు. గడువు లోపు మీటర్ రీడింగ్ తీసి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సబ్‌డివిజన్ కాంట్రాక్టర్ దయాల్, సెక్షన్ ఏఈలు, జేఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ సర్క్యూట్‌లో మంటలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెదతాడేపల్లి విద్యుత్ ప్రధాన సబ్ స్టేషన్ 132 కేవీ సీటీ బ్లాస్ట్ కారణంగా విద్యుత్ సర్క్యూట్‌లో సాంకేతిక లోపాలు తలెత్తి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో ప్రధాన సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం అన్ని ఫీడర్స్‌లోను విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేసి, మంటలు చెలరేగిన సర్క్యూట్‌ను వేరు చేశారు. కొత్త సర్క్యూట్‌ను అమర్చారు. రిపేర్ చేసి అన్ని ఫీడర్‌లకు విద్యుత్ సరఫరాను తిరిగి పునర్ధురించామని వివరించారు.

అంగన్‌వాడీ కొలువుల భర్తీకి దరఖాస్తులు

అత్తిలి: సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం తణుకు ప్రాజెక్టు అత్తిలి మండల పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాల సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. కె సముద్రపుగట్టు–1 కేంద్రంలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టును బీసీ–బీ మహిళకు, పెదపాడు కేంద్రంలో బీసీ–డీ మహిళకు కేటాయించినట్లు చెప్పారు. స్థానిక వివాహిత మహిళై, 21 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈపోస్టులకు అర్హులని తెలిపారు. దరఖాస్తుకు తగిన ధ్రువీకరణ పత్రాలు జతచేసి అక్టోబరు 5వ తేదీలోగా తణుకు సుధా ఆసుపత్రి ఎదురుగా ఉన్న శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారిణి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

తణుకు టౌన్: తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లోని సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ సీడీపీవో ఎంబీఎస్ ప్రమోదకుమారి తెలిపారు. తణుకు ఐసీడీఎస్ పరిధిలోని తణుకు పట్టణం 6వ వార్డు యానాదుల పుంత అంగన్‌వాడీ కేంద్రంలోని సహాకురాలి పోస్టు ఈడబ్ల్యూఎస్ వారికి, అత్తిలి మండలం కేఎస్ గట్టులో గల 1వ కేంద్రంలో బీసీ బీకి, తణుకు పట్టణం 8 వార్డు సోమరాజు పేట కేంద్రంలో ఓపెన్, వేల్పూరు 5లో ఓపెన్ కేటగిరీ, తణుకు పట్టణంలోని పెదపాడు కేంద్రంలో బీసీ డీ, ముద్దాపురం 2లో ఎస్సీ అభ్యర్థులకు రిజర్వు చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ అర్హతలు తెలిపే ధ్రువపత్రాలతో అక్టోబరు 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తణుకులోని తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

సేవకులు ఆధ్యాత్మిక ఉజ్జీవాన్ని రగిలించాలి



ఇవాంజలిస్ట్ రవి అబ్రహాం

పెంటపాడు: సువార్తికులు విశ్వాసులలో ఆద్యాత్మిక ఉజ్జీవాన్ని రగిలించాలని అంతర్జాతీయ సువార్తికులు రవి అబ్రహం పేర్కొన్నారు. గూడెం టౌన్ లూథరన్ ఎక్లాష్ ప్యారిష్ చర్చిలో సోమవారం పాస్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవకులు తమ సంఘాలలో విశ్వాసుల అభిమానాన్ని చూరగొనేలా దేవుని ఉన్నతమైన ఆధ్యాత్మిక బోదన సాగాలన్నారు. ఈ నెల 13 నుంచి గూడెంలో రవి అబ్రహాంమినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఉజ్జీవ సమావేశాలను సేవకులు విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్, గాడ్స్ ప్రసన్న, ఎస్.అబ్రహాం, రత్నరాజు, బిషప్ డి. ప్రకాష్, జిల్లాలోని పలు ప్రాంతాలనుండి సువార్తికులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేట భవిత సెంటర్ దివ్యాంగుల పిల్లల ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛ భారత్‌పై అవగాహన ర్యాలీ జరిగింది. భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతిలు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటితే స్వచ్ఛమైన ఆక్షిజన్ అందడంతోపాటు వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలని, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా అనారోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కుమారి, చంద్రకుమారి, సత్యవతి, నాగలక్ష్మి, రత్నకుమారి, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



అత్తిలిలో సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రమోదకుమారి అన్నారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా సోమవారం అత్తిలి గ్రామపంచాయతీ కార్యాలయంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ప్రమోదకుమారి మాట్లాడుతూ తల్లీ, బిడ్డకు రక్తహీనత లేకుండా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పదార్థాలను తీసుకోవాలన్నారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈసందర్భంగా 20 మంది గర్భిణులకు సీమంతాలు నిమిత్తం చీరలు, జాకెట్లు, పండ్లును మండల జనసేనపార్టీ అధ్యక్షులు దాసం ప్రసాద్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటావిజేత, అత్తిలి సెక్టార్ సూపర్‌వైజర్ కె కుమారి, తహసీల్దార్ దశిక వంశీ, తెదేపా మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, బీజేపీ నాయకులు ఐనంపూడి శ్రీదేవి, బాలం మహేష్, దిరిశాల వెంకట్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.